# పెళ్ళిగోల

పెళ్ళిళ్ళలో వంట బాగున్నా లేకపోయినా వంట బ్రామిన్స్‌తో తగూకెళ్లరాదు. అన్నం చిమిడినా, పప్పు మాడినా, కూర వుడికింగ్ సరిగా లేకపోయినా, పచ్చళ్ళలో పప్పు గిప్పు చాలకపోయినా కిక్కురుమనరాదు. తినేవాడుచెడతాడు, వండినవాడు కాదు. పైగా చేతిలో ఘనమైన అట్లకాడ, ఇనప గరిట వున్నవాడితోనా వేళాకోళం? సంగీతం మాష్టారికి లాగా వంట బ్రామిన్స్‌కి అదర్ సెక్స్‌తో కూడా విడి పరిచయాలుంటాయ్. పప్పురుబ్బింగ్, పచ్చడి నూరింగ్, ఉప్మా కలిపింగ్ మరియు కాఫీ, టీ మేకింగులకు పూర్ లేడీస్‌ని నియోగిస్తూ వుంటారు. ఏ రచయిత్రయినా ఓపికచేసుకుంటూ 'వంటలక్కథల'ని రాసి బహుమతో అవార్డో సంపాదించుకోవచ్చు. ఇప్పుడు శుభకార్యాల్లో వంట మనుష్యులు 'గ్రైండింగ్ మెషీన్లు' తెమ్మంటున్నారు. పూర్ ఫెలోస్ - వంటలక్క సొగసు, గ్రైండర్ కెలా వస్తుంది? ఈ వంటలక్కలు 'బి' క్లాసు ఆర్టిస్టు ల్లాటివాళ్ళు - హెడ్‌కుక్ గారు గాడి పొయ్య తవ్వించాక కొబ్బరికాయ కొట్టి, మిరపకాయ తీసి దిగదుడిచి పారేస్తారు. అదివెలిగించాక పేళ్ళు దుంగలు పేర్చినపుడు పొగవచ్చి పందిరంతా చుట్టబెట్టకుండా చూసుకోవల్సింది వంట బ్రాహ్మడి జూనియర్లే. నీళ్ళు తోడివ్వడాలు, వంటపాత్రల్నితోమించి అందివ్వడాలు, విస్తళ్ళ పరిపింగ్, మంచినీళ్ల సర్వింగ్ - యితర వడ్డన కార్యక్రమాలన్నీ జూనియర్ కార్యకర్తలు చూసుకోవాల్సిందే. వండేవాడికీ వడ్డించేవాడికీ వుండే తేడా మీద తినేవాడి అదృష్టం ఆధారపడి వుంటుంది. ఈ వంట బ్రామ్మలు సరుకు దోచేసి పదార్థాలు పాడుచెయ్యకుండా, పెళ్ళికూతురి మేనమామని 'అజమాయిషింగు' కి అట్టే పెడతారు. బంధువుల్లో 'పూర్ కజిన్స్' లాటివాళ్లని స్టోర్రూం, కిచెన్ సూపర్‌విజన్‌కి బెత్తాయిస్తారు. కిస్మిస్ పళ్ళు, జీడిపప్పులూ, ఎండుకొబ్బరి నవలచ్చని కొందరిందులోకి జొరబడతారు - కాని పాపం వీరికి వంటల ప్రపంచం తప్ప మరో సంగతి తెలీకుండా పోతుంది. స్టోర్రూంలోకి పడుచుపిల్లలు వస్తూంటారు అది కావాలి బావా యిది కావాలి బావా అని అల్లరిచేస్తూ - ఖర్జూరపు కాయలు, అరటి పళ్ళూ యిస్తామని వీళ్ళని లోపలికి పిలిచి కావలసినన్ని 'న్యూ సినిమాసాంగ్స్' పాడించుకోవచ్చు. దొంగచాటుగా సిగరెట్లు కాల్చేవాళ్ళకి స్టోర్రూంలో 'పాదాలచెంత చోటు' లాటిది లభిస్తుంది. అస్సలీదేశంలో స్టోర్రూంలో జరిగే 'రొమాన్స్' ల గురించి మన్మథ గుళికల్లాటి పుస్తకం రాయచ్చు.

వంట బ్రాహ్మల వలపు కథలు, హైక్లాస్ మనుషుల రొమాన్స్‌కేం తీసిపోవు. వీరిదీ శ్రమే, వారిదీ శ్రమే! ఇక్కడా చెమటే, అక్కడా చెమటే! బంధువుల్లో చాలామంది భోంచేసి నాలుగక్షింతలు వేసి వెళ్ళిపోవడానికి వస్తారు. ఆ భోజనం బావుంటే చాలా మటుకు పెళ్ళి బావున్నట్లే - పెళ్ళిళ్లలో పురోహితుడు అందరి కంటె ముఖ్యుడు. అన్ని ఫోటోల్లోనూ యితడే పడతాడు.

పురోహితుడు కీ బోర్డు ఆపరేటర్ లాటివాడు. ఇతనికీ మేళం వాయించేవాళ్ళకీ లింక్ వుంటుంది. మేళం వాళ్ళు అప్పర్‌హాండ్ అయితే పెళ్ళి మంత్రాలు వగైరా వినపడకుండా 'పయనమయే ప్రియతమా' వాయించేస్తారు. అపశబ్దాలూ, తుమ్ములూ, దగ్గులూ వినబడకుండా, మగపెళ్లివారి బ్రెయిన్ రాగింగ్‌కి బ్యాండుమేళం చాలా సహాయంచేస్తుంది. పురోహితుడు 'మేళాలూ వాయించండోయ్' అనకుండా కోపం వస్తే 'మేళాలూ చప్పుడుచెయ్యండ్రోయ్' అంటాడు. మన పెళ్ళిళ్ళలో పెళ్ళి చూడకుండా బ్యాండుమేళం దగ్గర కూర్చుని వాళ్ళకిష్ట మైన పాటల్ను వాయించమనే కుర్రకారుంటారు. నిజానికి వంట బ్రాహ్మల మీద అజమాయిషీకి వంటెంత రావాలో – సన్నాయి బ్యాండుమేళం వారిమీద పెత్తనం చేయడానికి సంగీతజ్ఞానం బాగా వుండాలి. కీర్తన వాయిస్తూంటే 'అహ్హా' అనేవారు లేకపోతే వాళ్ళకి ఏం హుషారుగా వుంటుంది! పురోహితుడు శాస్త్రోక్తంగా లయబద్ధంగా మంత్రాలు చదవాలి – తరువాత వంటవాళ్ళు – ఆ పైన మేళంవాళ్ళు యీమూడు బావుంటే పెళ్ళి బాగున్నట్లు లెక్క.

ఈ మధ్యన మా వాళ్ళ యింట్లో పెళ్ళయితే 'వీడియో' తీయించారు. పెళ్ళికి వెళ్లని వాళ్ళందరికీ 'వీడియో' చూపించారు. అందులో అంతా మగపెళ్ళివాళ్ళూ, వూరేగింపులో బ్యాండు మేళం తప్ప మావాళ్ళెవరూ చక్కగా కనపడలేదు. ఇంత డబ్బూ పోసి సినిమాలో మన వాళ్ళెవరూ లేరేమిటర్రా అంటే – అంతా వడ్డనల దగ్గర, వంట పందిట్లోనూ, స్టోర్ రూంలోను వున్నారట!

డిస్నీలాండ్ భూగర్భంలో కొన్ని వేలమంది ఇంజనీర్లు పనిచేస్తూ వుంటారుట – పైన బొమ్మల్ని నడిపించి మనల్ని ఆనందింపచేయడానికి. అలాగే మన యిళ్ళలో పెళ్ళిళ్ళలో 'బి' క్లాసు బంధువులు లేకపోతే, కాఫీలు, టీలు, టిఫెన్లూ కూర్చున్న చోటకల్లా అందిచ్చే వదినలు, అక్కలూ, అత్తలూ ఎక్కడ్నుంచి వస్తారు?

శ్రమ ఏవ జయతే – అంటే మా వాళ్ళకి అర్థం కాదు. సుఖాలూ రోగాలూ అన్నీ పనిచేయని వాళ్ళకే – యీచాకిరీ చేసే బంధువులు ఒక్కళ్ళూ మిస్సవకుండా టాక్సీలు పంపించి మరీ రప్పిస్తారు. వాళ్ళు రావడం రావడం పనుల్లో కలిపించుకు దూరిపోతారు. ప్రతి ఫామిలీలోనూ కుర్చీలు మంచాలు దిగని కులాసావర్గం, చాకిరీ వర్గం మీద జులుం చలాయిస్తో వుంటారు. ఫోటోల్లో పడేది వారూ, వడ్డనల్లో స్టోర్రూముల్లో, షాపింగ్‌లో, వంట పందిళ్ళలో నలిగేది వీళ్ళు – వీళ్ళు తిరగబడ కుండా బట్టలు పెడతారు – వధూవరుల చేత కాళ్ళకు దండాలు పెట్టిస్తారు. ఏ పెళ్ళికి వెళ్ళినా ఆ పెళ్ళి చూడలేని వాళ్ళు వీళ్ళే – మళ్ళీ పెళ్ళిళ్ళలో దొంగతనాలు జరిగితే 'బి' క్లాసు బంధువులకే ముప్పు అమర్యాదాను – మొత్తానికి పెళ్ళితో సమానమైన న్యూసెన్స్ మరోటిలేదు కాని మనుషులు ఎవరెలాంటివారో తెలిసేది అప్పుడే కదా! అందుకే శుభలేఖ వస్తే పెళ్ళి కెళ్లడం మిస్సవకండి! ఎవరిగోలవారిది.